

చంద్రబాబు భరోసా..

జిల్లాలో మూతపడిన చక్కెర కర్మాగారాలను తెరిపిస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. బొబ్బిలిలో రైతు బజారు ఏర్పాటు చేస్తామన్నారు. బాడంగి మండలం గొల్లాది వేగావతి నదిపై వంతెన మంజూరు చేస్తామని, యువత వలస పోకుండా స్థానికంగానే ఉపాధి కల్పిస్తామని, పరిశ్రమలు, ఐటీ రంగాన్ని అభివృద్ధి చేయడం ద్వారా ఉద్యోగాలను కల్పిస్తామని, నిరుద్యోగులకు నెలకు మూడువేల రూపాయల భృతి చెల్లిస్తామని, ఏడాదికి 4 లక్షల మందికి ఉద్యోగాలు కల్పించి ఐదేళ్లలో 20 లక్షలు ఉద్యోగాలు ఇస్తామని భరోసా ఇచ్చారు. స్వర్ణ యుగానికి సంక్రాంతి నాడు అందరూ సంకల్పం చేయాలని పిలుపునిచ్చారు.



బొబ్బిలి గర్జనకు విశేషంగా హాజరైన ప్రజలు

ప్రభుత్వ విధానాలను ఎండగడుతున్న చంద్రబాబు

ఉత్తరాంధ్రలో వారిద్దరి పెత్తనమేంటి?

విజయనగరం/ బొబ్బిలి జనవరి 10

- ఇక్కడి వారిని అణగదొక్కి ఇతరులకు ఆధిపత్యమా?
- మా ప్రభుత్వ హయాంలోనే బీసీలకు పెద్దపీట వేశాం
- మంగళసూత్రాలను తెంపే దుర్మార్గుడు జగన్
- స్వర్ణయుగం కోసం అందరం సంకల్పిద్దాం
- అధికారంలోకి వస్తే చక్కెర కర్మాగారాలను తెరిపిస్తాం
- వలసలు నివారించి ఉద్యోగాలు కల్పిస్తాం
- ప్రతి మండలంలో అన్న క్యాంటీలను తెరిపిస్తాం
- రా కదలిరా సభలో టీడీపీ అధినేత చంద్రబాబు



'జగన్ ప్రభుత్వం సామాజిక సాధికార యాత్రల పేరుతో ప్రజలను మభ్యపెడుతోంది. ఉత్తరాంధ్రపై విజయసాయిరెడ్డి, వైవీ సుబ్బారెడ్డిల పెత్తనం ఏమిటి? బీసీలకు కంచుకోటగా ఉన్న ఉత్తరాంధ్రలో మళ్లీ బీసీల రాజ్యం టీడీపీ అధికారంలోకి రావడం ద్వారా తీసుకొస్తాం' అంటూ టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు ప్రకటించారు. బొబ్బిలి రాజా కళాశాల మైదానంలో బుధవారం జరిగిన రా కదలిరా...బహిరంగ సభలో ఆయన ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను తీవ్రంగా ఎండగట్టారు. లోపభూయిష్టమైన విధానాలపై వాగ్బాణాలను ఎక్కుపెట్టారు. మాటల తూటాలను పేల్చారు. టీడీపీ హయాంలో చేసిన అభివృద్ధిని, ప్రాధాన్యంతా అంశాలను ప్రస్తావించారు. స్వర్ణయుగం కోసం సంకల్పిద్దామని పిలుపునిచ్చారు.

టీడీపీ హయాంలో ఎర్రన్నాయుడును కేంద్రమంత్రిని, కళావెంకటరావును రాష్ట్రమంత్రిని చేశామన్నారు. వైసీపీ ప్రభుత్వం ఉత్తరాంధ్రపై పెత్తనాన్ని ఇక్కడి బీసీలకు కాకుండా తన సొంత సామాజిక వర్గానికి చెందిన వారికి అప్పగించారని ఆరోపించారు. తమ హయాంలో సాగునీటి ప్రాజెక్టులకు రూ.16 వేల కోట్లను బడ్జెట్‌లో కేటాయించి సస్యశ్యామలం చేశామని, మడ్డువలస, తోటపల్లి, వంశధార, తారకరామతీర్థసాగర్ వంటి ప్రాజెక్టుల నిర్మాణానికి పెద్దపీట వేశామని అన్నారు. వైసీపీ ప్రభుత్వం అభివృద్ధిని గాలికి వదిలేసిందన్నారు. భూ సర్వే పేరుతో జగన్ ఫొటోలు ముద్రించారని, మన ఆస్తులపై ఆయన ఫొటోలేమిటని ప్రశ్నించారు. భూ రక్షణ పేరుతో భూ భక్షణ చట్టం తెచ్చారని, ఈ చట్టంలో ప్రమాదకరమైన క్లాజులు ఉన్నాయని, మన ఆస్తి మనది కాకుండా చేసే క్లాజులు ఉన్నాయన్నారు. ఏదైనా లిటిగేషన్ వస్తే స్థానిక కోర్టుల్లో కాకుండా నేరుగా హైకోర్టులోనే తేల్చుకోవాల్సిన పరిస్థితి ఉందన్నారు. తమకు ఎదురుతిరిగే వారిపై కక్షగట్టి వారి భూములను 22ఎ నిషేధిత జాబితాలో చేర్చి ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు.

- రాజాం వైసీపీ ఎమ్మెల్యేను పాయకరావుపేట ఇన్‌చార్జిగా నియమించారని, ఇక్కడ గెలుపొందలేని చెత్త ఎమ్మెల్యే పాయకరావుపేటలో బంగారం అయిపోతారా? అని ఎద్దేవా చేశారు. 80 మంది ఎమ్మెల్యేలు, మంత్రులను బదిలీ చేస్తున్నారని, అక్కడ గెలుపొందలేరని స్వయంగా ఒప్పుకుంటున్న పరిస్థితి వైసీపీలో నెలకొందన్నారు. వైసీపీలో సీటు రావాలంటే వారు బూతులు తిట్ల దండకంలో బూతు రత్న, భూషణ్, బూతుశ్రీ లుగా నిష్ణాతులై ఉండాలని ఎద్దేవా చేశారు.



బొబ్బిలి పౌరుషం గుర్తుగా కత్తి, డాలుతో...

- ఉద్యోగ భద్రత... జీతాలు పెంచాలని అంగన్వాడీలు సమ్మె చేస్తే బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు వారికి ఒళ్లు బలిసి సమ్మె చేస్తున్నారని దూషించడం దారుణమన్నారు. జీతాలు పెంచాలని సమ్మె చేస్తే ఎస్మా చట్టాన్ని ప్రయోగించడం ఏమిటని ప్రశ్నించారు. బొబ్బిలి ఎమ్మెల్యే చెరువులు, బందలు, ప్రభుత్వభూములు ఆక్రమించుకున్నారని ఆరోపించారు.
- ఎచ్చెర్ల ఎమ్మెల్యే పెట్టే బాధలు భరించలేక అక్కడి సాక్షి విలేకరి ఆత్మహత్య చేసుకున్నాడని, సూసైడ్ నోట్‌లో ఈ విషయాన్ని మృతుడు రాసినప్పటికీ ఆ ఎమ్మెల్యేపై ఎందుకు కేసు పెట్టలేదని ప్రశ్నించారు.
- భోగాపురం విమానాశ్రయం, గిరిజన విశ్వవిద్యాలయం, శ్రీకాకుళం జిల్లాలో భావనపాడు పోర్టు వంటి వాటికి తానే శంకుస్థాపన చేశానన్నారు. మళ్లీ వాటికే శంకుస్థాపన పేరుతో హడావిడి చేశారని గుర్తు చేశారు.
- టీడీపీ హయాంలో ఇసుక ఉచితంగా అందించే పరిస్థితి ఉండేదన్నారు. ఇప్పుడు ఇసుక మాఫియా ఏర్పడి దోచుకుంటున్నారన్నారు. మొత్తం ఖనిజ సంపదను కొల్లగొడుతున్నారని ఆరోపించారు.
- ఆడపిల్లల మంగళసూత్రాలను తెంపే దుర్మార్గుడు జగన్ అని చంద్రబాబు ధ్వజమెత్తారు. 50 రూపాయలు ఉండే మద్యం క్వార్టర్ బాటిల్‌ను ఏకంగా రెండొందల రూపాయలకు పెంచారని, సొంత కంపెనీలో తయారు చేసిన నాశిరకం మద్యం అమ్ముతున్నారన్నారు. దీనిని తాగి అనేకమంది మృతి చెందుతున్నారని మహిళల మంగళసూత్రాలు తెగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.



చంద్రన్నకు గోడు వెళ్లబోసుకుంటున్న అంగన్వాడీలు

కానుక లేవీ?

టీడీపీ హయాంలో క్రిస్మస్, సంక్రాంతి, రంజాన్ పండుగలకు కానుకలు అందించే వారమని, రేషన్ డిపోల ద్వారా 8 రకాల సరుకులను పంపిణీ చేశామని గుర్తు చేశారు. నేడు ఒక్క బియ్యంకే పరిమితమయ్యారన్నారు. నిరుపేదలకు భోజనం అందించే అన్నా క్యాంటీన్లను దుర్మార్గంగా మూసివేశారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారంలోకి వచ్చిన వెంటనే మండల స్థాయిలో అన్నా క్యాంటీన్లను ఏర్పాటు చేస్తామన్నారు. బొబ్బిలిలో బేబీనాయన ఆధ్వర్యంలో అన్నా క్యాంటీన్ కొనసాగుతుండడం అభినందనీయమన్నారు.



ఎన్టీఆర్‌కు నివాళి అర్పిస్తున్న చంద్రబాబు, టీడీపీ నాయకులు

రద్దుల ప్రభుత్వం..

ఎస్సీ, ఎస్టీలకు రెండువందల యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందించామని, వైసీపీ హయాంలో రద్దు చేసి తొమ్మిది సార్లు విద్యుత్ చార్జీలను పెంచారన్నారు. అలాగే ఆర్టీసీ చార్జీలు, డీజిల్, పెట్రోలు, వంటగ్యాస్ ధరలను విపరీతంగా పెంచారన్నారు. ఇదో రద్దుల ప్రభుత్వమని, పేదల వ్యతిరేక ప్రభుత్వమని విమర్శించారు. మూడు రాజధానుల పేరుతో మూడుముక్కలాట ఆడుతున్నారన్నారు. వచ్చే ఎన్నికలు సైకో జగన్‌కు ఐదు కోట్ల జనానికి మధ్య పోటీ అని చెప్పారు.

బొబ్బిలి గర్జన సభలో మాజీ మంత్రులు కిమిడి కళావెంకటరావు, ప్రతిభాభారతి, ఆర్‌వీసుజయ్‌కృష్ణరంగారావు, కోండ్రు మురళీమోహన్, పడాల అరుణ (జనసేన), ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, పార్టీ జిల్లా అధ్యక్షుడు కిమిడి నాగార్జున, బొబ్బిలి ఇన్‌చార్జి బేబీనాయన, విజయనగరం ఇన్‌చార్జి పూసపాటి అదితి గజపతిరాజు, మాజీ ఎమ్మెల్యేలు తెంటు లక్ష్మునాయుడు, కోళ్ల లలితకుమారి, ఆర్‌పీ భంజ్‌దేవ్, కేఏ నాయుడు, మాజీ ఎమ్మెల్సీలు గుమ్మిడి సంధ్యారాణి, నాయకులు విజయచంద్ర, కరణం శివరామకృష్ణ, ద్వారపురెడ్డి జగదీష్, తేయక జగదీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

విజయనగరంలో చిన్న శ్రీను..

విశాఖకు ఝాన్సీలక్ష్మి?

- వైసీపీలో టిక్కెట్ల కేటాయింపులో ఊహించని పరిణామాలు





(విజయనగరం-ఆంధ్రజ్యోతి)

వైసీపీలో టిక్కెట్ల ఖరారు అంశం ప్రధాన చర్చనీయాంశమైంది. ఊహించని విధంగా ఇన్‌చార్జిలను మార్చేస్తున్నారు. కొందరికి నో టిక్కెట్ అంటున్నారు. ఈ క్రమంలో కొత్తకొత్త స్థానాల్లో కొత్తకొత్త వ్యక్తులకు టిక్కెట్లు ఖరారవుతున్నాయి. తాజాగా జడ్పీ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) పేరు తెరపైకి వచ్చింది. ఈయనకు విజయనగరం ఎంపీ టిక్కెట్ ఖరారుకానున్నట్లు తెలుస్తోంది. సిట్టింగ్ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్‌కు ఎచ్చెర్ల అసెంబ్లీ సీటును కేటాయిస్తారన్న ప్రచారం సాగుతోంది. 2019 ఎన్నికల్లో ఊహించని విధంగా బెల్లాన చంద్రశేఖర్‌కు ఎంపీ టిక్కెట్టు కేటాయించారు. తాజాగా జరగనున్న ఎన్నికల్లో చిన్న శ్రీను టిక్కెట్టు రేసులో ఉన్నారు. ఇదిలా ఉండగా మరో ఊహించని పరిణామంగా బొత్స ఝాన్సీలక్ష్మికి విశాఖ లోక్‌సభ వైసీపీ టిక్కెట్టు కేటాయించనున్నారు. ఇటీవల ఆమె తాను విశాఖ జిల్లాకు స్థానికురాలిని అని స్వయంగా ప్రకటించారు. ఇప్పటికే బొత్స ఝాన్సీ బొబ్బిలి మాజీ ఎంపీగా పనిచేశారు. రెండు పర్యాయాలు జడ్పీ ఛైర్‌పర్సన్‌గా పనిచేశారు. విశాఖ ఎంపీగా బరిలో ఉన్నట్లు వైసీపీ మూడో జాబితాలో పేరు ఉందని సమాచారం.

సడలని సంకల్పం

- చలికి వణుకుతూనే సమ్మె సాగిస్తున్న అంగన్వాడీలు
- శిబిరంలోనే నిద్ర

విజయనగరం(ఆంధ్రజ్యోతి)/ కలెక్టరేట్, జనవరి 10: నినాదం మారలేదు.. ఉద్యమ స్ఫూర్తి తగ్గలేదు.. కర్తవ్యం నీరసించలేదు.. అంగన్వాడీలు సడలని సంకల్పంతో ముందుకు సాగుతున్నారు. ప్రభుత్వంతో తాడోపేడో తేల్చుకొందే సమ్మె వీడేదిలేదని భీష్మించారు. 30 రోజులుగా ఆందోళన బాటలోనే ఉన్నారు. ప్రభుత్వం దిగిరాకుంటే ఎంతకైనా తెగిస్తామంటున్నారు. తాము ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారించాలని, పాదయాత్ర సమయంలో సీఎం జగన్ ఇచ్చిన హామీలు అమలు చేయాలని ఉద్యమంలోకి దిగారు. అదే లక్ష్యంతో పోరాడుతున్నారు. సమ్మెకు దిగి బుధవారం నాటితో 30 రోజులైంది. విజయనగరం కలెక్టరేట్ శిబిరంలో కొద్దిరోజులుగా అక్కడే నిద్రకు ఉపక్రమిస్తున్నారు. చలి తీవ్రంగా వణికిస్తున్నా ఇబ్బందులు పడుతూనే ఉద్యమాన్ని వీడబోమంటున్నారు. వారి కుటుంబ సభ్యులు కూడా వచ్చి తోడ్పాటు అందిస్తున్నారు. బుధవారం కలెక్టరేట్ శిబిరం వద్దకు పలు కార్మిక సంఘాల నేతలు వచ్చి మద్దతు తెలిపారు. అంగన్వాడీల సంఘం నాయకులు బి.పైడిరాజు, వి.లక్ష్మీ, సుధారాణి మాట్లాడుతూ ప్రభుత్వం భయపెట్టాలని చూస్తోందని, ఎస్మాలకు, నోటీసులకు భయపడబోమని ప్రభుత్వం తెలుసుకోవాన్నారు. సత్వరమే సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.



సమ్మె శిబిరంలోనే నిద్రకు ఉపక్రమించిన అంగన్వాడీలు

22 రోజులుగా సమగ్ర శిక్ష ఉద్యోగులు

సమగ్ర శిక్ష ఉద్యోగుల నిరసన కొనసాగుతోంది. 22 రోజులుగా కలెక్టరేట్ వద్ద సమ్మె చేస్తున్న ఉద్యోగులు బుధవారం కూడా నినాదాలతో హోరెత్తించారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు మాట్లాడుతూ అందరికీ ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి గ్రాడ్యూటీ రిటైర్మెంట్ బెనిఫిట్‌ను తక్షణమే అమలు చేయాలన్నారు. సమాన పనికి సమాన వేతనం అందజేయాలని, మహిళా ఉద్యోగులకు చైల్డ్ కేర్ లీవులు మంజూరు చేయాలని కోరారు.



మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

పాస్‌వర్డ్‌లు షేర్ చేయొద్దు: కలెక్టర్ నాగలక్ష్మి

కలెక్టరేట్, జనవరి 10: బీఎల్‌వోల నుంచి ఈఆర్‌వోల వరకూ పాస్‌వర్డ్‌లను ఎవ్వరికీ షేర్ చేయకూడదని, వారే స్వయంగా ఆపరేట్ చేయాలని, లేని పక్షంలోని శిక్షకు గురవుతారని కలెక్టర్ నాగలక్ష్మి స్పష్టంచేశారు. తన చాంబర్‌లో రాజకీయ పార్టీల నాయకులు, ఎన్నికల సిబ్బందితో బుధవారం సమావేశమయ్యారు. ఓటర్ల సవరణ కోసం అందిన దరఖాస్తులను ఈనెల 17వ తేదీ లోగా పరిష్కరించాలని ఆదేశించారు. ఈనెల 3 నుంచి 9 వరకూ ఫారం 6,7,8 కోసం మొత్తం 4321 దరఖాస్తులు అందాయని, వీటిని 17 లోగా డిస్పోజ్ చేయాలని ఈఆర్‌వోలకు ఆదేశించారు. కలెక్టర్‌కు అందిన ఫిర్యాదులన్నింటికీ వెంటనే సమాధానాలు పంపాలని డీఆర్‌వోకు సూచించారు. ఎన్నికలు జరిగే వరకూ స్వీప్ కార్యక్రమాలు కొనసాగుతాయని, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొని ఓటర్ల చైతన్యం కోసం తగిన సలహాలు అందించాలని అన్నారు. బీఎల్‌వోల నుంచి ఈఆర్‌వోల వరకూ వారి పాస్‌వర్డ్‌లను ఎవ్వరికి షేర్ చేయకూడదని సూచించారు. సమావేశంలో డీఆర్‌వో అనిత, ఈఆర్‌వోలు వెంకటేశ్వరరావు, సుధారాణి, నూకరాజు తదితరులు ఉన్నారు.

సర్వర్ డౌన్

- గ్రూప్-2కు దరఖాస్తు చేసుకోగలమా? : అభ్యర్థులు

కలెక్టరేట్, జనవరి 10: గ్రూపు-2కు దరఖాస్తు చేసుకునేందుకు సర్వర్ సమస్య వెంటాడుతోంది. గంటల కొద్దీ ప్రయత్నించినా విఫలమవ్వడంతో అభ్యర్థులు తీవ్రంగా విసుగెత్తిపోతున్నారు. సమయం వృథా అవుతోందని వాపోతున్నారు. మొదటి నుంచి సర్వర్ సమస్య ఉండడంతో నెట్ సెంటర్ల వద్ద నిరీక్షిస్తున్నారు. నిరుద్యోగులను ఊరిస్తూ గత నెల 7న ప్రభుత్వం గ్రూపు-2 నోటిఫికేషన్ విడుదల చేసింది. వివిధ శాఖలకు సంబంధించి మొత్తం 899 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చింది. అభ్యర్థులు గత నెల 21 నుంచి ఈనెల 10వ తేదీ వరకూ దరఖాస్తు చేసుకోవాలని పొందుపరిచారు. కాగా సర్వర్ సమస్య ఉండటంతో దరఖాస్తు గడువును ఈనెల 17 వరకూ పొడిగిస్తూ బుధవారం ఏపీపీఎస్సీ ఉత్తర్వులు జారీ చేసింది. ఆన్‌లైన్‌లో అభ్యర్థుల రిజిస్ట్రేషన్ ప్రక్రియ జరుగుతోంది కానీ ఫీజు రూ.267 తీసుకోవడం లేదు. గతంలో ఏపీపీఎస్సీ లింక్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్న అభ్యర్థులకు ఓటీపీఆర్, పాస్‌వర్డ్‌లు ఉంటాయి. ఇప్పుడు గ్రూపు-2కి దరఖాస్తు చేసుకున్న సమయంలో ఓటీపీఆర్, పాస్‌వర్డ్‌లు ఎంటర్ చేస్తే ఆన్‌లైన్‌లో దరఖాస్తు ఓపెన్ కావాలి. కాని సర్వర్ సమస్య వల్ల కావడం లేదు. దీంతో అర్హత గల అభ్యర్థులు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఒకవైపు చదువు కోవాలా? మరోవైపు దరఖాస్తు చేసుకోవాలా? అని ఆందోళన చెందుతున్నారు. సర్వర్ సమస్యను త్వరగా పరిష్కరించాలని కోరుతున్నారు.

గంపగుత్తగా మద్యం

- అక్రమ నిల్వలను గుర్తించిన పోలీసులు
- మడ్డువలస ప్రభుత్వ షాపులో కొనుగోలు
- సిబ్బందే కీలక పాత్ర..



స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లు

వంగర, జనవరి 10: ప్రభుత్వ మద్యం షాపు నుంచి ఇష్టారాజ్యంగా మద్యం తరలుతోందని, అక్రమంగా పెద్దమొత్తంలో తీసుకువెళ్లి బెల్ట్‌షాపుల్లో అమ్ముకుంటున్నారని, సిబ్బందే సహకారం అందిస్తున్నారని.. చెబితే అటువంటిదేం లేదని బుకాయించే ఎక్సైజ్ ఉన్నతాధికారులు ఈ ఘటనను ఏ మంటారో! మడ్డువలస గ్రామంలో పెద్ద మొత్తంలో మద్యం నిల్వలను పోలీసులు మంగళవారం అర్ధరాత్రి గుర్తించారు. వాటిని ప్రభుత్వ మద్యం షాపు నుంచే తరలించారు. ఈ కేసులో ఆటోడ్రైవర్‌ను అరెస్టు చేశారు. నలుగురిపై కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.

మడ్డువలస ప్రభుత్వ మద్యం షాపు నుంచి అదే గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ బురాడ సురేష్ పెద్దమొత్తంలో మద్యం బాటిళ్లను మంగళవారం రాత్రి తీసుకుని ఆటోలో లోడు చేశాడు. వాటిని వివిధ గ్రామాల్లోని బెల్ట్ షాపులకు చేర్చాల్సి ఉంది. వేకువజామున ఇవ్వొచ్చునని భావించి సురేష్ ఇంటికి వెళ్లిపోయాడు. స్టాకు మొత్తాన్ని తన ఇంటి సమీపంలో ఉన్న పశువుల శాలలో దాచిపెట్టాడు. ఈ విషయాన్ని గమనించిన కొందరు స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. రాజాం ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ శ్రీధర్ సిబ్బందితో కలిసి మంగళవారం అర్ధరాత్రి మడ్డువలసలో దాడులు జరిపి అక్రమ మద్యం నిల్వలను గుర్తించారు. డ్రైవర్ సురేష్‌ను అరెస్టు చేసి ఆటోను స్టేషన్‌కు తరలించారు. డ్రైవర్ సురేష్ బుధవారం విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వ మద్యం షాపు సిబ్బందే తనను పిలిచి కిరాయికి మాట్లాడి సరుకు లోడు చేశారని, కిరాయి కోసం ఆశపడి వెళ్లానని చెప్పాడు. కాగా ఆటోలో 250 బాటిళ్లు తరలించాడని సమాచారం. పోలీసులు మాత్రం 54 బాటిళ్లేనని చెబుతున్నారు.మద్యం తరలిస్తున్న బూరాడ సురేష్‌తో పాటు మద్యం షాపు సిబ్బంది పోలిరెడ్డి హరికృష్ణ, తివనాన గణేష్, సీరాపు చంద్రమౌళిపైనా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శ్రీధర్ తెలిపారు.

అంతా గోప్యం

మంగళవారం అర్ధరాత్రి దాడుల్లో మద్య బాటిళ్లను గుర్తించిన పోలీసులు విషయాన్ని బుధవారం సాయంత్రం వరకు గోప్యంగా ఉంచారు. నిందితుడు విలేకరుల వద్ద భోరున విలపించడంతో విషయం బయటకు పొక్కినట్లు తెలుసుకున్న సిబ్బంది ఆ తర్వాతే కేసు నమోదు చేసినట్లు సమాచారం. మద్యం బాటిళ్లు ఎక్కడికి తరలిస్తున్నదీ స్పష్టత ఇవ్వడం లేదు. విచారించాల్సి ఉందంటున్నారు.

గొల్లలపేటలో డయేరియా


డయేరియాతో బాధ పడుతున్న పాపారావుకు వైద్య సేవలందజేస్తున్న సిబ్బంది

బొండపల్లి: గొల్లలపేటలో డయేరియా బారిన పలువురు పడడంతో బొండపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారులు ఎంపీపీ స్కూల్‌లో వైద్య సేవలు అందించారు. గ్రామానికి చెందిన సారాది పాపారావుకు స్కూల్‌లోనే వైద్య సేవలను అందించగా.. పీతల కొండమ్మ, పీతల అప్పయ్యమ్మలకు మెరుగైన వైద్యం కోసం పీహెచ్‌సీకి తరలించినట్లు వైద్యాధికారి సమీర తెలిపారు. స్కూల్ ఆవరణలో వైద్య శిబిరం ఏర్పాటుచేయగా... పీతల దానయ్య, లక్ష్మి, కొండమ్మ, అప్పలకొండమ్మలు జ్వరంతో బాధ పడుతూ చికిత్సపొందారు. పీతల ఎర్రమ్మ, కొండమ్మ, అప్పయ్యమ్మ, సుంకరి అప్పారావు, బొట్టా రాజమ్మ, ఎం.కృష్ణమ్మలు డయేరియా లక్షణాలతో చికిత్స పొంది ఇంటికి వెళ్లిపోయినట్లు తెలిపారు. గ్రామంలో మురుగునీటి కాలువల్లో బ్లీచింగ్ చల్లడంతో పాటు మంచినీటి ట్యాంకులు శుభ్రం చేసినట్టు సర్పంచ్ బొండపల్లి ఈశ్వరరావు తెలిపారు. ప్రస్తుతం అందరి పరిస్థితి బాగానే ఉందని 2వ సచివాలయం హెల్త్‌వెల్‌నెస్ కేంద్రం ఎంఎల్‌హెచ్‌సీ వరలక్ష్మి తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

చీపురుపల్లి: మండలంలోని గచ్చులవలస సబ్ స్టేషన్ పరిధిలో ఆర్‌డీఎస్ఎస్ కింద కొత్తగా విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేస్తుండడంతో గురువారం ఉదయం 10 నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏడీఈ బీమరాజు ఒక ప్రకటనలో తెలిపారు. కర్లాం, గచ్చులవలస, అలజంగి, మెట్టపల్లి, పేరిపి, నిమ్మలవలస గ్రామాలకు సరఫరా నిలిపివేస్తున్నట్టు పేర్కొన్నారు. వినియోగదారులు ఈ విషయాన్ని గమనించాలని ఆయన కోరారు.

షికారుగంజిలో గడ్డివాము దగ్ధం

దత్తిరాజేరు: షికారుగంజి సమీపంలో నల్లజీర పొలం సమీపంలో గడ్డి లోడుతో వస్తున్న ట్రాక్టర్‌కు విద్యుత్ తీగలు తగిలి మంటలు రేగాయి. అదే గ్రామానికి చెందిన నేరేడుబల్లి నాగేష్‌కు చెందిన గడ్డివాము పూర్తిగా దగ్ధమైంది. ట్రాక్టర్ ట్రాలీ కొంతమేర కాలిపోయింది. సమాచారం అందుకున్న బాడంగి అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకున్నప్పటికే నష్టం జరిగిపోయింది.

కెరటాం రైసుమిల్లుపై కేసు నమోదు

బొండపల్లి: కెరటాం గ్రామంలో గల మహేశ్వరి రైసు మిల్లులో తూనికలు, కొలతల శాఖ జిల్లా అసిస్టెంట్ లీగల్ కంట్రోలర్ పి.వి.రంగారావు వేబ్రిడ్జి కాటాను పరిశీలించి కేసు నమోదు చేసినట్లు సీఎస్‌డీటీ రవిశంకర్ తెలిపారు. లీగల్ మెట్రాలజీ అధికారులు వేబ్రిడ్జి సీళ్లు సక్రమంగా లేకపోవడాన్ని గుర్తించి కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

దీర్ఘకాలిక వ్యాధిగ్రస్థులకు మందులు

● రాష్ట్ర సెకండరీ హెల్త్ సంచాలకుడు వెంకటేష్


ఏపీవీవీపీ కమిషనర్ వెంకటేష్‌కు వినతిపత్రం ఇస్తున్న కిషోర్

పార్వతీపురం ఆంధ్రజ్యోతి: దీర్ఘకాలిక వ్యాధిగ్రస్థులకు మందులను కేంద్ర డ్రగ్ స్టోర్ నుంచి గ్రామ, వార్డు సచివాలయానికి పంపించి అక్కడ నుంచి బాధితునికి అందించనున్నట్లు రాష్ట్ర సెకండరీ హెల్త్ సంచాలకుడు, జేఏఎస్ జిల్లా ప్రత్యేకాధికారి వెంకటేష్ తెలిపారు. బుధవారం చాకలి బెలగాంలో జగనన్నఆరోగ్యసురక్ష వైద్యశిబిరాన్ని తనిఖీచేశారు. అనంతరం జిల్లా ఆసుపత్రిలో గర్భిణులకు అందుతున్న వైద్య సేవలపై ఆరాతీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జేఏఎస్ రెండో దశ జనవరి 2 నుంచి ప్రారంభమైందన్నారు. కార్యక్రమంలో ఐటీడీఏ పీవో సి.విష్ణుచరణ్, డీఎంహెచ్‌వో బి.జగన్నాథ రావు, డిప్యూటీ డీఎంహెచ్‌వో శివకుమార్, డీసీహెచ్ఎస్ వాగ్దేవి, ఆర్‌బీఎస్‌కే ప్రాజెక్టు అధికారి దవళభాస్కరరావు, ప్రోగ్రాంఅధికారి ఎం.వినోద్, డీఐవో ఎం. నారాయణరావు, కిషోర్ పాల్గొన్నారు. ●జిల్లా కేంద్రాసుపత్రిలో రోగులకు అందుతున్న వైద్య సేవలు బాగున్నాయని లక్ష్యానికి మించి ప్రసవాలు జరగడం హర్షణీయమని ఏపీవీవీపీ కమిషనర్ వెంకటేష్ తెలిపారు. జిల్లా కేంద్రాసుపత్రిని సందర్శించి రోగులకు అందుతున్న వైద్యసేవలపై వారితో మాట్లాడి తెలుసుకున్నారు. అనంతరం ఏరియా ఆసుపత్రిలో ఖాళీగా ఉన్న వైద్యులు పోస్టుల గురించి డీసీహెచ్‌వో జిల్లా కేంద్రాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వాగ్దేవి కమిషనర్‌కు వివరించారు. ● **బెలగాం:** ఏపీ వైద్య విధాన్ పరిషత్ కమిషనర్ ఎస్.వెంకటేష్‌కు ఏపీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు జీవీఆర్ఎస్ కిషోర్ ఆధ్వర్యంలో గిరిజన ప్రాంతాల్లో పనిచేస్తున్న నర్సింగ్, పారా మెడికల్, మినిస్టీరియల్, ఎన్‌హెచ్ఎంలో పనిచేస్తున్న వారికి ట్రైబల్ వెయిటేజ్, ట్రైబల్ అలవెన్స్ డాక్టర్లతో పాటుఇవ్వాలని వినతిపత్రంఇచ్చారు.15రోజుల్లో ట్రైబల్ వెయిటేజ్‌పై ఉత్తర్వులు ఇస్తానని, అలెవెన్స్‌పై ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తానని తెలిపారు.

కోడిపందేలు ఆడితే చర్యలు: సీఐ

సాలూరు: సంక్రాంతి పురస్కరించుకుని కోడిపందేలు, పేకాట ఆడితే చర్యలు తప్పవని పట్టణ సీఐ జీడీ బాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.సారా, గంజాయి, బెల్ట్‌షాపులు ఎవరైనా నిర్వహించినా, రవాణా చేసినా, అమ్మినా లేదా ప్రోత్సహించినా చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి

సాలూరు: అగ్ని ప్రమాదాలపై ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సాలూరు అగ్ని మాపక అధికారి ఉప్పాడ సుధాకరరావు కోరారు. పట్టణంలో శ్రీనివాస గ్యాస్ ఏజెన్సీ వద్ద బుధవారం ప్రజలు, గ్యాస్ సిబ్బందికి అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పించారు. ●**పాలకొండ:** పట్టణంలోని గ్రామీణ వికాస్ బ్యాంకులో అగ్ని ప్రమాదాలపై అగ్నిమాపక అధికారి జామి సర్వేశ్వరరావ బుధవారం అవగాహన కల్పించారు. అగ్ని ప్రమాదాలు సంభవిస్తే 08941-260111 లేదా టోల్ ఫ్రీ నెంబర్ 101 ద్వారా అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించాలని తెలిపారు. కార్యక్రమంలో బ్యాంకు బ్రాంచ్ మేనేజర్ డొంక శ్రీనివాసరావు, ఫీల్డ్ ఆఫీసర్లు డీసీఎస్‌వీ రవికుమార్, సుధాకర్, ఆఫీస్ అసిస్టెంట్లు సీహెచ్ సంధ్యారాణి, ఎం.మహేష్ పాల్గొన్నారు.

ఏపీ రైతు సంఘ రాష్ట్ర కార్యదర్శిగా అప్పలనాయుడు

పాలకొండ: ఏపీరైతు సంఘం రాష్ట్ర కార్యదర్శిగా మన్యం జిల్లా రైతు సంఘం నాయకులు బుడితి అప్పలనాయుడు ఎన్నికయ్యారు. ఏపీరైతు సంఘం రాష్ట్ర 18వ మహాసభలు రాజమండ్రిలో మూడు రోజులుగా జరుగుతున్నాయి. ఈ మహాసభల్లో పార్వతీపురం మన్యం జిల్లా రైతు సంఘం నాయకులు పాల్గొనగా, జాతీయ అధ్యక్షుడు రావుల వెంకయ్య సమక్షంలో రాష్ట్ర నూతన సమితిని ఎన్నుకున్నారు.

తిరుమలరావుకు రామరాజు ట్రస్టు పురస్కారం

పాలకొండ: మండలంలోని ఓని ప్రాథమికోన్నత పాఠశాలలో సాంఘికశాస్త్ర ఉపాధ్యాయుడు కుదమ తిరుమలరావుకు విద్యా, సామాజిక, సాహిత్య, కళా సేవా రంగాల్లో నిరంతర కృషి చేస్తున్నందుకు రామరాజు చారిటబుల్ ట్రస్టు అభినందన పురస్కారం బుధవారం ప్రదానం చేసింది. శ్రీకాకుళం జిల్లా పాతపట్నానికి చెందిన రామరాజు చారిటబుల్ ట్రస్టు అధినేత పారిశెల్లి రామరాజు నేతృత్వంలో జరిగిన విద్యా సదస్సు వేదికపై తిరుమలరావు సేవలను కొనియాడారు.

సమానపనికి సమాన వేతనం ఇవ్వాలి

సీతంపేట: సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని సవరభాషా వలంటీర్ల జిల్లా కమిటీ అధ్యక్షుడు సవర ఆనందరావు డిమాండ్ చేశారు.స్థానిక సీఐటీయూ కార్యాలయంలో బుధవారం సవర భాషా వలంటీర్ల నూతన జిల్లా కమిటీ ఎన్నికలు నిర్వహించారు. ఈసందరంగా ఆనందరావు మాట్లాడుతూ ఐటీడీఏ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న సవరభాషా వలంటీర్లకు కనీస వేతనం ఇవ్వడం లేదని, దీంతో కుటుంబ ఆర్థికపరిస్థితులు ఇబ్బందిగా మారుతున్నాయని, దీంతో సమానపనికి సమాన వేతనం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్.ఎల్లంగో, ఎస్.మాసయ్య, బి.సుహాసిని, ఎం.భారతి పాల్గొన్నారు.

3000 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం

సాలూరు రూరల్: కొడంగివలస అటవీప్రాంతంలో సాలూరు రూరల్ ఎస్‌ఐ ఎం.వెంకటరమణ ఆధ్వర్యంలో బుధవారం పోలీసులు జరిపిన దాడిలో తయారు చేసి రవాణాకు సిద్ధంగా ఉంచిన 460 లీటర్ల సారా, సారా తయారీకి ఉంచిన 3000 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. ఎత్తైన కొండల్లో పట్టుబడడంతో వాటిని కిందకు తీసుకువచ్చే అవకాశం లేక అక్కడే ధ్వంసం చేసినట్టు ఎస్‌ఐ తెలిపారు.


గజపతినగరం: దండాలు పెట్టి నిరసన తెలియజేస్తున్న అంగన్‌వాడీలు


చీపురుపల్లి: కోలాటం ఆడుతున్న అంగన్‌వాడీ కార్యకర్తలు


రామభద్రపురం: మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ

హామీలు అమలు చేయాల్సిందే

● బెదిరింపులకు భయపడబోం

● 30వ రోజుకు చేరిన అంగన్‌వాడీల సమ్మె

సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలను అమలుచేయాల్సిందేనని అంగన్‌వాడీలు స్పష్టం చేశారు. ప్రభుత్వం ఎస్మాపేరుతో సమ్మెను విచ్ఛిన్నంచేసే కుట్ర చేస్తోందని,తమను ఎన్ని రకాలుగా బెదిరించినా భయపడే ప్రశక్తే లేదనితేల్చిచెప్పారు. బుధవారానికి సమ్మె 30వ రోజుకు చేరింది. ఈసందర్భంగా ఉమ్మడి జిల్లాలో వినూత్నంగా నిరసన తెలిపారు.

- ఆంధ్రజ్యోతి బృందం


జామి: మోకాళ్లపై కూర్చొని నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు


కురుపాం: నమస్కారంచేసి నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు


రాజాం రూరల్: రిలే దీక్షలో అంగన్‌వాడీలు


శృంగవరపుకోట: ఒంటికాలిపై నిల్చొని నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

గజపతినగరంలో సంక్రాంతి సంబరాలు


సంక్రాంతి సంబరాలను నిర్వహిస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

గజపతినగరం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో అధ్యాపకులు, విద్యార్థులు సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. భోగి మంటలతో పాటు గొబ్బెమ్మలు, ముగ్గులు, ఆటపాటలతో సంబరాలను జరుపుకున్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రకాశ్ పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

రామతీర్థం చేరిన అయోధ్య అక్షింతలు


అక్షింతల కలశాన్ని అందుకుంటున్న అర్చకులు

నెల్లిమర్ల: అయోధ్యలో ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న శ్రీరాముని ఆలయం నుంచి రామతీర్థం రామస్వామి వారి దేవస్థానానికి బుధవారం అక్షింతలు చేరాయి. విజయనగరం జిల్లా సమరసత సేవా సంస్థ ప్రతినిధులు ఈ అక్షింతల కలశాన్ని దేవాలయానికి తీసుకువచ్చారు. ఆలయ అర్చకులు ఆహ్వానించి తొలుత చుట్టూ ప్రదక్షిణ నిర్వహించారు. అనంతరం అక్షింతలను స్వామి వారి సన్నిధిలో ఉంచి అర్చన కార్యక్రమాలు నిర్వహించారు. ఈనెల 22న అయోధ్యలో జరగబోనున్న శ్రీరాముని విగ్రహ ప్రతిష్ఠ వరకు శ్రీరామ జయరామ జయజయ రామ అనే తారక మంత్రాన్ని జపిస్తూ అక్షింతలను రోజుకు 108 సార్లు ఆ పాత్రలో వేయాలని అర్చకులు సూచించారు.

అయోధ్య అక్షింతలు పంపిణీ


కొండగూడెంలో అక్షింతలు పంపిణీ చేస్తున్న దృశ్యం

రాజాం: సంతకవిటి మండలం కొండగూడెం గ్రామంలో అయోధ్య రామ మందిరం అక్షింతలను గ్రామ పెద్దల సమక్షంలో బుధవారం పంపిణీ చేశారు. రామ మందిరం ఫొటోలను కూడా ప్రతి ఇంటికీ వెళ్లి అందించారు. స్థానిక వస్త్రపురి కాలనీలో బుధవారం శ్రీ ఆంజనేయ స్వామి యువజన సంఘం ఆధ్వర్యంలో అయోధ్య అక్షింతలు, ఫొటోలను పంపిణీ చేశారు. కాలనీ వాసులు కోలాటం. పండర భజన వంటి సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు.

చీడివలసలో వికసిత్ భారత్ యాత్ర

కొత్తవలస: రామలింగపురం, చీడివలసలో వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. అధికారులు, బీజేపీ నాయకుల ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. కొత్తవలస గ్రామీణ వికాస్ బ్యాంక్ మేనేజర్ తిరుమలేశ్వరరావు జనధన్ యోజనపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రధాని నరేంద్రమోదీ ఆధ్వర్యంలో కేంద్రప్రభుత్వం అమలుచేస్తున్నపథకాల గురించి వివరించారు. వియ్యంపేట పీహెచ్‌సీ వైద్యాధికారి గోపాలకృష్ణ ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో రామలింగపురం, చీడివలస సర్పంచ్‌లు నెక్కల గౌరునాయుడు, అప్పలనాయుడు, ఎంపీటీసీ లెంక వరహాలు, పంచాయతీ కార్యదర్శులు వి.సత్యవతి, వి.రాము, బీజేపీ నాయకులు వై.ప్రసాద్ పాల్గొన్నారు.

బ్యాంకు సేవలపై విద్యార్థులకు అవగాహన

గంట్యాడ: మండలంలోని మదనాపురం ఆదర్శ పాఠశాలలో ఒకేషనల్ చదువుతున్న విద్యార్థులకు బుధవారం బ్యాంకు సేవలపై అవగాహన కల్పించారు. తాటిపూడి ఎస్‌బీఐ బ్యాంకులో ఖాతాదారులకు అందిస్తున్న సేవలుపై ఆయా బ్యాంకు సిబ్బంది వివరించారు. బ్యాంకు మేనేజరు నగేష్ పలు అంశాలపై వివరించారు. కార్యక్రమంలోని ప్రిన్సిపాల్ రామకృష్ణ, ఒకేషనల్ ట్రైనర్ వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

వాడీవేడిగా 'ప్రజావేదిక'

● వివిధ పనులపై రూ.40 లక్షల వరకు అభియోగాలు

● ఉపాధి సిబ్బందికి అపరాధ రుసుం


సిమెంట్ పక్కదారి పట్టడంపై సిబ్బంది నుంచి వివరాలు సేకరిస్తున్న అదనపు పీడీ

రేగిడి: మండలంలో 2022-23 వార్షిక ఏడాదికి సంబంధించి బుధవారం నిర్వహించిన సామాజిక ప్రజావేదిక వాడీవేడిగా సాగింది. ఉపాధి, పంచాయితీ రాజ్, సమగ్ర శిక్ష, ఆర్‌డబ్ల్యూఎస్‌కు సంబంధించి రూ.19.83 కోట్ల పనులపై ప్రజావేదిక నిర్వహించారు. వైస్ ఎంపీపీ వి.జగన్మోహనరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎస్ఆర్‌పీ ఎస్.మాధవరావు ఆధ్వర్యంలో ఆడిట్ సిబ్బంది వివిధ పనుల్లో లోపాలను గుర్తించారు. ప్రిసైడింగ్ అధికారిగా డుమా జిల్లా అడిషనల్ పీడీ లక్ష్మణరావు వ్యవహరించారు. జిల్లా విజిలెన్స్ విభాగంఅధికారి వెంకటరమణ, డుమా ఏఓ వెంకటనాయుడు, ఏడీపీ శ్రీనివాసరావు, ఎంపీడీఓశ్యామలాకుమారి తదితరులు వివిధ అంశాలపై చర్చించారు.

సిమెంట్ పక్కదారి

నరసనాపల్లి, ఖండ్యాం పంచాయతీల్లో వివిధ పనులకు ఇచ్చిన సిమెంట్ పక్కదారి పట్టినట్లు గుర్తించారు. ఖండ్యాంలో 74 బస్తాలకు రూ.18,796, నరసనాపల్లిలో 524 బస్తాలకు సంబంధించి రూ.1.52లక్షలు ఇతర పనులకు మళ్లించినట్లు గుర్తించారు. వీటి రికవరీకిసోషల్ ఆడిట్ సిబ్బంది సిఫారసు చేశారు. దీనిపై అదనపు పీడీ స్పందిస్తూ ఈ భవనాలకు సిమెంట్ కొనుగోలు చేసి ఇవ్వాల్సిన బాధ్యత సిబ్బందిదేనని పీఆర్ ఏఈ రామకృష్ణను ఆదేశించారు. దేవుదళలో బల్క్‌మిల్క్ సెంటర్ నిర్మాణంలో అదనపు చెల్లింపులను గుర్తించారు. వెంకమ్మపేట పంచాయితీలో ఉపాధికి సంబంధించి రెండు చెరువుల్లో పనులు చేయకుండానే రూ.65,880 చెల్లించినట్లు గుర్తించారు. దీనిపై అదనపు పీడీ, ఎస్ఆర్‌పీల మధ్య స్వల్ప వాగ్వాదం నడిచింది. అదనపు పీడీ సిబ్బందిని వెనకేసికొచ్చినట్లు సోషల్ ఆడిట్ సిబ్బంది అభిప్రాయపడ్డారు. మరికొన్ని అంశాలలోనూ లోపాలు ఉన్నట్టు గుర్తించారు.

రూ.40 లక్షల వరకు అభియోగాలు

డిసెంబరు 13 నుంచి 31 వరకు 39 పంచాయితీల్లో వివిధ పనులపై నిర్వహించిన ఆడిట్‌లో దాదాపు రూ.40 లక్షల వరకు అభ్యంతరాలు ఉన్నట్టు ఎస్ఆర్‌పీ ఎస్.మాధవరావు తెలిపారు. రికవరీపై స్పష్టత రావలసి ఉందన్నారు. మస్తర్లలో దిద్దుబాట్లు, రికార్డుల నిర్వహణ లేకపోవడంపై 20 పంచాయితీల ఫీల్డ్ అసిస్టెంట్లకు రూ.500 నుంచి రూ.వెయ్యి వరకు అపరాధ రుసుం విధించినట్లు ఏపీఓ తెలిపారు.

తోటపల్లి ఆలయానికి రూ.లక్ష విరాళం

గరుగుబిల్లి: తోటపల్లి వేంకటేశ్వరాలయం అభివృద్ధికి ఓ నిరుపేద వృద్ధురాలు విరాళం అందజేసింది. బుధవారం ఆలయ ప్రాంగణంలో జియ్యమ్మవలస మండలంలోని బట్లభద్ర గ్రామానికి చెందిన ఓలేటి లక్ష్మి లక్ష రూపాయలు అభివృద్ధి ట్రస్ట్‌కు అందించింది.ఈ సందర్భంగా లక్ష్మి మాట్లాడుతూ స్వయంభూవుగా వెలసిన తోటపల్లి ఆలయానికి పూర్వ వైభవం రావాలని తన కోరిక అని, ఈ మేరకు తన వంతుగా సహాయం చేశానని తెలిపింది. కార్యక్రమంలో ఛైర్మన్ ఎం.సత్యనారాయణ, మేనేజింగ్ ట్రస్టీ డి.ధనుంజయనాయుడు, ఎగ్జిక్యూటివ్ ట్రస్టీ డాక్టర్ డి.పారినాయుడు, కన్వీనర్ శ్రీరామచంద్రమూర్తి, ట్రెజరర్ దుర్గారావు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

● బొబ్బిలిలో చంద్రబాబుకు ఏపీటీఎఫ్ వినతి

సాలూరు రూరల్: ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఏపీటీఎఫ్ నాయకులు కోరారు. ఈ మేరకు టీడీపీ అధినేత చంద్రబాబునాయుడుకు బొబ్బిలిలో జేసీ రాజుతో కలిసి వినతిపత్రం అందజేసినట్లు ఏపీటీఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షుడు బంకురు జోగినాయుడు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సీపీఎస్ రద్దు, యాప్‌ల భారం తగ్గించాలని, పీఆర్సీ, డీఏ బకాయి చెల్లింపు, జీవో-117 రద్దు తదితర సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని కోరామని పేర్కొన్నారు.

గోదారంగ నాథ స్వామికి పల్లకీ సేవ

సాలూరు రూరల్: సాలూరు లోని కల్యాణ వేంకటే శ్వరస్వామి ఆల యంలో ధనుర్మాస 25వ పాశురం పురస్కరించుకుని గోదారంగనాథస్వామికి బుధవారం ప్రత్యేక పూజలు, పల్లకీ సేవలు చేశారు. ధర్మకర్త వంగపండు రాజేంద్రప్రసాద్, విజ యలక్ష్మి, బుల్లిరెడ్డి, సతీ ష్, శ్రీనివాసరావు తదితర దంపతులతో రుత్వికులు నారాయ ణాచార్యులు, ఉదయ భాస్కరాచార్యులు శాస్త్రోక్తంగా శతనామార్చన, ద్రవిడవేద పారా యణ,తిరుప్పావై సేవా కాలం పూజలను చేయించారు. స్వామికి పల్లకీ సేవ చేశారు.

మహిళల ఆర్థికాభివృద్ధే ధ్యేయం

గుర్ల: పొదుపు సంఘాల మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలనే ఉద్దేశంతో డ్వాక్రా రుణాలు మాఫీ చేశామని పలాస నియోజకవర్గ పరిశీలకుడు కేవీ సూర్య నారాయణరాజు అన్నారు. బుధవారం గుర్లలో మండల సమాఖ్య సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో వైసీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పొట్నూరు సన్యాసినాయుడు, డీఎల్‌డీఏ చైర్మన్ బెల్లా బంగారునాయుడు పాల్గొన్నారు.

'క్రీడాకారులను వెలికితీయడమే లక్ష్యం'

గుర్ల: గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారులను వెలికితీయడమే ఆడుదాం ఆంధ్రా లక్ష్యమని జడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం స్థానిక జూనియర్ కళాశాల ఆవరణలో ఆడుదాం ఆంధ్రా మండలస్థాయి క్రీడ పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో పలాస నియోజకవర్గ పరిశీలకుడు కేవీ సూర్యనారాయణరాజు, జడ్పీటీసీ శీర అప్పలనాయుడు, డీఎల్‌డీఏ చైర్మన్ బెల్లాన బంగారునాయుడు ఎంఈవో భాను ప్రకాష్, ఎంపీడీవో కళ్యాణి పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో బత్తిన చేరిక

పాలకొండ: పాలకొండకు చెందిన దళిత నాయకుడు బత్తిన మోహన్‌రావు బుధవారం విజయవాడలో పీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. రాష్ట్ర ఇన్‌చార్జి మాణిక్యం ఠాగూర్, కేంద్ర మాజీ మంత్రి జేడీ శీలం, కొప్పుల రాజు సమక్షంలో పార్టీలో చేరారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

పాలకొండ: పాలకొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జీవిత చరిత్రపై డిబేట్, వ్యాసరచన, క్విజ్ పోటీలు మండలంలోని వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులకు నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు వీరఘట్టం ఎంఈవో ఆనందరావు బహుమతులు అందించారు. న్యాయ నిర్ణేతలుగా ఉపాధ్యాయులు బొరోతు శంకరరావు, జనార్దనరావు, కుసుమకుమారి, శివకుమారి, బాబూరావు వ్యవహరించారు.

యువత క్రీడల్లో రాణించాలి

మక్కువ: యువత క్రీడల్లో రాణించాలని జడ్పీటీసీ సభ్యుడు మావుడి శ్రీనివాసరావు తెలిపారు.బుధవారం స్థానిక జడ్పీఉన్నత పాఠశాల ఆవరణలో ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో సీహెచ్ సూర్యనారాయణ, తహసీల్దార్ ఎ.సూర్యనారాయణ పాల్గొన్నారు. ●**గరుగుబిల్లి:** గ్రామీణ ప్రాంత క్రీడాకారుల ఉజ్వల భవిష్యత్ కోసమే ఆడుదాం ఆంధ్ర ఆటల పోటీలు నిర్వహిస్తున్నామని ఎంపీపీ ఉరిటి రామారావు, ఉమ్మడి జిల్లాల జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ మరిశర్ల బాపూజీనాయుడు తెలిపారు. బుధవారం గరుగుబిల్లి జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో మండల స్థాయి ఆడు దాం ఆంధ్ర క్రీడా పోటీలను ప్రారంభించారు. ●**కురుపాం:** కురుపాంలో నియోజకవర్గ స్థాయి ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఎంపీడీఓ ఎస్.అప్పారావు ఆధ్వర్యంలో నిర్వహించారు.

సత్తాచాటిన డిగ్రీ విద్యార్థులు

సీతంపేట: సీతంపేట డిగ్రీ కళాశాల విద్యార్థులు ఇంటర్ స్టేట్ ఇంటర్ యూనివర్శిటీ జోన్-1 స్థాయి పోటీల్లో జానపద నృత్యా లు, థింసా ప్రథమస్థానంలో నిలిచినట్టు ఆ కళాశాల ప్రిన్సిపాల్ వైశ్యాంబాబు బుధవారం తెలిపారు. ఇటీవల శ్రీకాకుళం బీఆర్ అంబేడ్కర్ యూనివర్శిటీ మైదానంలో జరిగినపోటీల్లో విద్యా ర్థులు సత్తాచాటినట్లు చెప్పారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ప్రభాకరరావు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల సమ్మె విరమణ

బెలగాం/సాలూరు రూరల్: ప్రభుత్వంతో చర్చలు సఫలం కావడంతో తాత్కాలికంగా సమ్మె విరమించినట్లు మున్సిపల్ కార్మికులు తెలిపారు. జీవో వచ్చిన తర్వాత పూర్తిగా సమ్మె విరమిస్తామని స్పష్టం చేశారు. సమ్మె కాలానికి వేతనం ఇచ్చేందుకు సర్కారు అంగీకరించిందని, ఈ మేరకు గురువారం నుంచి పారిశుధ్య కార్మికులు విధుల్లో చేరనున్నారని సీఐటీయూ నాయకులు గొర్లి వెంకటరమణ, ఎన్‌వై నాయుడు తెలిపారు. వారికి వేతనం రూ. 21 వేలు ఇవ్వడానికి ప్రభుత్వం ఒప్పుకుందన్నారు. దహనసంస్కార ఖర్చులు రూ. 15 వేల నుంచి 20 వేలకు, ప్రమాద మరణానికి పరిహారం రూ. 5 లక్షల నుంచి రూ. 7 లక్షలకు పెంచినట్లు చెప్పారు. పదవీ విరమణ సమయంలో రూ. 50 వేలు బెనిఫిట్ ఇవ్వడానికి అంగీకరించిందన్నారు. ఇంజినీరింగ్ కార్మికుల కోసం ప్రత్యేక కమిటీ వేసి వేతనాల నిర్ధారించనున్నారని తెలిపారు.

పార్వతీపురం టౌన్/సాలూరు/పాలకొండ: తమ సమస్యలపై ప్రభుత్వం స్పందించకుంటే ఏం తినాలి.. ఎలా బతకాలి? అని పార్వతీపురంలో మున్సిపల్ పారిశుధ్య కార్మికులు ప్రశ్నించారు. ఈ మేరకు బుధవారం ఇంజనీరింగ్ విభాగం కార్మికులతో కలిసి పార్వతీపురంలో మున్సిపల్ కార్యాలయం ఎదుట వేప ఆకులు చేతబట్టి.. వినూత్నంగా నిరసన తెలిపారు. ఆకులు తిని బతకాలా? అంటూ నినదించారు. గతంలో తమకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని కొద్దిరోజులుగా సమ్మె చేస్తుండగా.. సీఎం జగన్ నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం భావ్యం కాదన్నారు. కార్మికుల కష్టాలు కనిపించడం లేదా? అని ప్రశ్నించారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి తమ సమస్యలపై చొరవ చూపాలని, లేకుంటే సమ్మె ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు.సమ్మె 16వ రోజుకు చేరుకోవడంతో సాలూరు మున్సిపల్ కార్యాలయంలో పారిశుధ్యకార్మికులు ఆ సంఖ్య రూపంలో కూర్చొని నిరసన తెలిపారు. పాలకొండలో కూడా నిరసన తెలిపారు.

బాబు దృష్టికి నియోజకవర్గ సమస్యలు

● అరకు టీడీపీ బీసీ సెల్ అధికార ప్రతినిధి సత్యనారాయణ

గరుగుబిల్లి: టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు దృష్టికి కురుపాం నియోజకవర్గ సమస్యలను తీసుకువెళ్లినట్లు అరకు నియోజకవర్గ టీడీపీ బీసీ సెల్ అధికార ప్రతినిధి, నాగూరు ఎంపీటీసీ సభ్యుడు ద్వారపురెడ్డి సత్యనారాయణ తెలిపారు. బుధవారం బొబ్బిలిలో నిర్వహించిన టీడీపీ గర్జనకు అధిక సంఖ్యలో తరలివెళ్లామని పేర్కొన్నారు. వైసీపీ ప్రభుత్వంపై ప్రజలు పూర్తిస్థాయిలో విసుగు చెందారని తెలిపారు. రాష్ట్రం అభివృద్ధి బాటలో నడవాలంటే ముఖ్యమంత్రిగా చంద్రబాబు ఉండాలని పేర్కొన్నారు. కురుపాం, గుమ్మలక్ష్మీపురం మండలాల పరిధిలో రానున్న ఎన్నికల్లో గెలుపుపై ప్రత్యేక దృష్టి సారించాల్సి ఉందని వివరించామని తెలిపారు.ఎన్నికల్లో పార్టీ బలపర్చిన అభ్యర్థి గెలుపునకు కృషి చేయాలని సూచించారని పేర్కొన్నారు. వైసీపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ప్రజలకు తెలియజేసి గెలుపే ధ్యేయంగా కృషి చేయాలని సూచించారని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ ప్రతినిధులు ఎ.విప్లవకుమార్, బి.తమ్మయ్య, బి.పద్మావతి, ఎం.శశిభూషణరావు, కండేన బలరాంనాయుడు, అక్కేన నారాయణరావు, బి.శంకరరావు, సీహెచ్ రామకృష్ణ, అప్పలకొండ పాల్గొన్నారు.

పీహెచ్‌సీ ఆవరణలో పిచ్చిమొక్కల తొలగింపు

గరుగుబిల్లి: స్థానిక పీహెచ్‌సీ ఆవరణలో పిచ్చి మొక్కలను బుధవారం యంత్రాలతో తొలగించారు. ఈసందర్భంగా డాక్టర్ కేకే సాగర్‌వర్మ మాట్లాడుతూ రోగు లకు సౌకర్యంగా ఉండేలా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. గతంలో ఆవర ణలో పిచ్చిమొక్కలవల్ల విషసర్పాలు పీహెచ్‌సీలోకి వచ్చేవని చెప్పారు. ఆవరణ లో పిచ్చిమొక్కలు తొలగించి ఆహ్లాదకరంగా ఉండేలా మొక్కలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు.

టీడీపీ హయాంలోనే అభివృద్ధి

-కళా వెంకటరావు, మాజీ మంత్రి

తెలుగుదేశం పార్టీ హయాంలో అనేక అభివృద్ధి పనులు చేపట్టాం. ముఖ్యంగా సాగునీటి ప్రాజెక్టులకు అధిక ప్రాధాన్యం కల్పించాం. తోటపల్లి, మడ్డువలస, పెద్దగెడ్డ వంటి ప్రాజెక్టులను పూర్తి చేశాం. ఈ ప్రాంత రైతులు రెండు పంటలు పండించే విధంగా అభివృద్ధి పరిచాము. ఐదేళ్ల వైసీపీ పాలనలో ఒక్క ఎకరాకు కూడా అదనంగా సాగునీందించలేదు. అంతేకాకుండా రైతు వ్యతిరేక విధానాలను అవలంబిస్తోంది.

రెండోసారి మోసపోవద్దు

- సుజయ్ కృష్ణ రంగారావు, మాజీ మంత్రి

ఒక్క చాన్స్ పేరుతో అధికారంలోకి వచ్చిన జగన్ అరాచకపాలనతో ప్రజలు విసుగు చెందారు. ఈ పరిస్థితుల్లో రెండోసారి మోసపోకండి. ప్రజలంతా అప్రమత్తం కావాలి. ఎన్నికల్లో వైసీపీకి గుణపాఠం చెప్పాలి.

ఉపాధి అడిగితే లాఠీ దెబ్బలు కొట్టారు

- బేబీనాయన, టీడీపీ బొబ్బిలి ఇన్‌చార్జి

బొబ్బిలి గ్రోత్‌సెంటర్‌లోని పరిశ్రమల్లో ఉపాధి కల్పించాలని భూములు కోల్పోయిన రైతులు డిమాండ్ చేశారు. భూములిచ్చిన వారికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించకుండా వారిని అన్యాయంగా అరెస్టు చేసి, లాఠీలతో కొట్టారు. నాలుగన్నరేళ్లలో రైతులకు, మహిళలకు, యువతకు తీవ్ర అన్యాయం చేశారు. స్థానిక సంస్థలను నిర్వీర్యం చేశారు.

దోచుకో... దాచుకో

- జనసేన నేతలు యశస్విని, లోకం మాధవి

దోచుకో.. దాచుకో అనే విధంగా వైసీపీ పాలన సాగుతోంది. భూ దందా, ఇసుక దోపిడీ, మద్యం మాఫియా ఇలా అనేక విధాలా ప్రజలను దోచుకుంటున్నారు. రైతులకు వైసీపీ ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేస్తోంది. ధాన్యం కొనుగోలులో రైతులను దోచుకుంటున్నారు. కౌలు రైతులను ఆదుకునేందుకు జనసేన అధినేత పవన్ కల్యాణ్ సహాయం అందించారు. టీడీపీ-జనసేన మద్దతుతో బరిలోకి దిగిన అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలి.

టీడీపీతోనే యువతకు భవిత

- ప్రతిభాభారతి, మాజీ స్పీకర్

టీడీపీ ద్వారానే యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు వస్తాయి. ప్రస్తుతం యువత ఇతర రాష్ట్రాలకు , దేశాలకు వలస పోతున్నారు. పరిశ్రమల స్థాపన, ఐటీ అభివృద్ధిలో చంద్రబాబుకు అనుభవం ఉంది. రాష్ట్రంలోని యువతకు తగ్గ ఉద్యోగాలు కల్పించాలంటే పరిశ్రమల స్థాపన, ఐటీ రంగాభివృద్ధి కీలకమైనది. వచ్చే ఎన్నికల్లో, టీడీపీని అత్యధిక మెజార్టీతో గెలిపించడం ద్వారా రాష్ట్రం అభివృద్ధి చెందుతుంది.

వైసీపీని బంగాళాఖాతంలో కలపాలి

- తెంటు లక్ష్మునాయుడు, మాజీ ఎమ్మెల్యే

వస్తున్న ఎన్నికల్లో వైసీపీని పూర్తిగా ఓడించి బంగాళాఖాతంలో కలపాలి. ప్రజావ్యతిరేక విధానాలతో వైసీపీ అన్ని వర్గాలను వేధింపులకు గురిచేస్తోంది. ఏ రంగంలోనూ అభివృద్ధి చేయకుండా బటన్ ప్రభుత్వంగా ముద్ర పడింది. సంపదను సృష్టించకుండా అప్పులపై ఆధారపడి రాష్ట్రాన్ని అధోగతి పాలు చేసింది.

బొబ్బిలి గర్జన విజయవంతం

రా కదిలిరా సభ విజయవంతమైంది. అనుకున్నట్టే బొబ్బిలి ప్రజల గర్జన రాష్ట్రమంతా వినపడింది. జిల్లాలోని అన్ని ప్రాంతాల నుంచి టీడీపీ శ్రేణులు, అభిమానులు, మహిళలు, వృద్ధులు వేలాదిగా తరలివచ్చారు. సభ ప్రాంగణమంతా జై చంద్రబాబు నినాదాలతో మార్మోగింది. చంద్రబాబు ప్రసంగిస్తున్నంత సేపూ చప్పట్లు, ఈలలతో మద్దతు తెలిపారు. సభ చివరి వరకు జనం కదలలేదు. ఎంతమంది వచ్చినా ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేశారు. వేదికపై ముఖ్య నాయకులు మాట్లాడారు. ఈ సభ టీడీపీ శ్రేణుల్లో మరింత ఉత్సాహం నింపింది. జోష్ తెచ్చింది.

- విజయనగరం/ బొబ్బిలి



చంద్రబాబుతో మాట్లాడుతున్న జనసేన నాయకురాలు మాధవి



మాట్లాడుతున్న కిమిడి నాగార్జున

మండుటెండలో సడలని అభిమానం

బొబ్బిలి జనవరి 10: బొబ్బిలి గర్జన సభకు హాజరైన ప్రజలు మండుటెండను కూడా ఖాతరు చేయలేదు. మధ్యాహ్నం 12 గంటలకు ప్రారంభం కావాల్సిన సమావేశానికి పదిగంటల నుంచే జనమంతా తరలిరావడం ప్రారంభించారు. గంట ఆలస్యంగా చంద్రబాబు ప్రసంగం ప్రారంభమైనప్పటికీ కదలకుండా వేచి ఉండడం గమనార్హం. జిల్లా నలుమూలల నుంచి అభిమాన గణం వేల సంఖ్యలో తరలివచ్చారు. గ్రామీణ ప్రాంతాల నుంచే కాకుండా బొబ్బిలి పట్టణంలోని గొల్లపల్లి, మల్లమ్మపేట, పాతబొబ్బిలి, జగన్నాధపురం తదితర ప్రాంతాల నుంచి మహిళలు డప్పువాయిద్యాలు, డ్యాన్సులు చేసుకుంటూ వచ్చారు. కురుపాం, పార్వతీపురం, నియోజకవర్గాలలోని వివిధ మండలాల నుంచి ఆటోల్లో భారీగా తరలివచ్చారు.

- బొబ్బిలి పట్టణానికి చెందిన మాజీ కౌన్సిలర్లు రెడ్డి ప్రసాద్, ఎ.అప్పారావు, కోట సురేష్‌లు చం ద్రబాబు సమక్షంలో పార్టీలో చేరారు.
- చంద్రబాబుకు గోడు చెప్పుకునేందుకు పలు సంఘాలు పెద్ద సంఖ్యలో వచ్చాయి. అంగన్వాడీల సంఘం నాయకులు, ఏపీటీఎఫ్ నాయకులు జేసీ రాజు, బంకురు జోగినాయుడు, ప్రవీణ్‌కుమార్ తదితరులు తమ సమస్యలను చంద్రబాబు దృష్టికి తెచ్చారు. పెన్షనర్ల ఇతర సమస్యలను ఆ సంఘం రాష్ట్ర నేత రౌతు రామ్మూర్తి చంద్రబాబుకు వివరించారు.

డీఎస్సీ నిర్వహించని ప్రభుత్వం

- వేపాడ చిరంజీవిరావు, ఎమ్మెల్సీ

రాష్ట్రంలో ఏ ప్రభుత్వం వచ్చినా తమ హయాంలో ఒక్కసారైనా డీఎస్సీ నిర్వహిస్తారు. ఏటా జనవరిలో జాబ్ కేలండర్ ప్రకటన చేసి వైసీపీ ప్రభుత్వం మాట తప్పింది. డీఎస్సీని నిర్వహించకుండా నిరుద్యోగుల జీవితాలతో ఆడుకుంటోంది. రాక్షస పాలన అందిస్తున్న వైసీపీని గద్దెదించేందుకు ప్రతి ఒక్కరూ కంకణ బద్ధులు కావాలి.

విద్యామంత్రికి అవగాహన లేదు

- కిమిడి నాగార్జున, టీడీపీ జిల్లా అధ్యక్షుడు

విద్యాశాఖమంత్రిగా పనిచేస్తున్న బొత్స సత్యనారాయణ విద్యకు సంబంధించిన అంశాలపై ఐదు నిమిషాలు ప్రసంగించాలి. అప్పుడే విద్యాశాఖపై అతనికి ఉన్న అవగాహన అర్థమవుతుంది. అవినీతి పాలనకు వైసీపీ కేరాఫ్ అడ్రస్‌గా మారింది.

అరాచక పాలనను అంతమొందిద్దాం

-కర్రోతు బంగార్రాజు, నెల్లిమర్ల ఇన్‌చార్జి

రాష్ట్రంలో అరాచకపాలనను అంతమొందించేందుకు అందరూ నడుం బిగించాలి. గత ఐదేళ్లుగా కక్షసాధింపులతో వైసీపీ పాలన సాగింది. ఇక దానికి చరమగీతం పాడాలి. ఇందుకోసం రాష్ట్ర ప్రజలంతా చాలా ఉత్సాహంగా ఉన్నారు.

బొబ్బిలి పులుల్లా గర్జిద్దాం

- విజయచంద్ర, పార్వతీపురం ఇన్‌చార్జి

వచ్చే ఎన్నికల్లో ఓటు అనే ఆయుధంతో ప్రతి ఒక్కరూ బొబ్బిలి పులై గర్జించాలి. వైసీపీని తరిమి కొట్టాలి. రాష్ట్రానికి చంద్రబాబు పరిపాలనను తీసుకువచ్చేందుకు బొబ్బిలి సభ నాంది కావాలి.

గిరిజనులకు అందని విశ్వవిద్యాలయం

- గుమ్మిడి సంధ్యారాణి, సాలూరు

గిరిజనులకు అందుబాటులో లేకుండా విశ్వవిద్యాలయాన్ని నిర్మిస్తున్నారు. సాలూరు ప్రాంతంలో నిర్మించాల్సిన గిరిజన విశ్వవిద్యాలయాన్ని విజయనగరం జిల్లాకు తరలించారు. ఇది దుర్మార్గం. వైసీపీ ప్రభుత్వంలో ఐటీడీఏ పాలకవర్గ సమావేశాలు జరపకుండా ఆ సంస్థను నిర్వీర్యం చేస్తున్నారు. ఉప ముఖ్యమంత్రి ఉన్నా ప్రయోజనం లేకపోయింది.



కోడూరు ఎంపీటీసీ శ్రీదేవిని పార్టీలోకి ఆహ్వానిస్తున్న చంద్రబాబు

చంద్రబాబు సమక్షంలో టీడీపీ తీర్థం

రామభద్రపురం, జనవరి 10: మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సమక్షంలో పలువురు వైసీపీ నుంచి టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. మండలంలోని కోటశిర్లాం వైసీపీ సర్పంచ్ తాడ్డి లక్ష్మీతోపాటు కోటశిర్లాం, ఎనుబరువు, పాడివానివలస గ్రామాలకు చెందిన 500 కుటుంబాలు తెలుగుదేశంలో చేరాయి. బాడంగి మండలం కోడూరు వైకాపా ఎంపీటీసీ మరిపి శ్రీదేవితోపాటు మరికొంతమంది బొబ్బిలి మండలం వైసీపీ ఇన్‌చార్జ్ పిరిడి ఈశ్వరరావు, వేదాంత డవలపర్స్ అధినేత కోట సురేష్, బొబ్బిలి పట్టణానికి చెందిన వైసీపీ నాయకులు రెడ్డి త్రినాథ, అప్పారావుతోపాటు వారి అనుచరులు కూడా తెలుగుదేశం తీర్థం పుచ్చుకున్నారు. వీరందరికి చంద్రబాబునాయుడే స్వయంగా పసుపు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో మాజీ మంత్రి సుజయ్‌కృష్ణరంగారావు, బొబ్బిలి టీడీపీ ఇన్‌చార్జ్ బేబీనాయన, మాజీ ఎమ్మెల్యే తెంటు లక్ష్మంనాయుడు పాల్గొన్నారు.

బాబు సభతో నూతనోత్తేజం:కోండ్రు

రాజాం: బొబ్బిలిలో బుధవారం జరిగిన టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు 'రా కదలిరా' బహిరంగ సభతో పార్టీ శ్రేణుల్లో నూతనోత్తేజం కనిపిస్తోందని మాజీ మంత్రి, నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి కోండ్రు మురళీమోహన్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సభలో రాజాం నియోజకవర్గ ప్రజలు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. మరో 90 రోజుల్లో వైసీపీ నుంచి రాష్ట్రానికి విముక్తి కలుగుతుందని, చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా పాలన అందిస్తారన్నారు.

వివేకానంద మార్గంలో పయనించాలి

శృంగవరపుకోట: స్వామి వివేకానంద సూచించిన మార్గంలో యువత పయనించాలని ఆర్టీసీ డిపో మేనేజర్ రమేష్ అన్నారు. బుధవారం మోక్ష విద్యామందిర్ ఆధ్వర్యంలో స్థానిక ప్రైవేటు డీగ్రీ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం 'వివేకానంద జీవితం-సందేశం' అనే పుస్తకాలను ఉచితంగా అందించారు.

మెరుగైన సేవలు అందిద్దాం

రాజాం: సామాజిక ఆసుపత్రికి వచ్చిన రోగులకు అందరం కలిసి మెరుగైన సేవలు అందిద్దామని సూపరింటెండెంట్‌గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన కరణం హరిబాబు అన్నారు. ఆసుపత్రిలో పూర్తి స్థాయిలో వైద్యులు ఉన్నారని, సిబ్బంది కూడా కొరత లేదన్నారు. రోగులకు సేవలు అందించడమే లక్ష్యంగా పని చేయాలన్నారు. వైద్యులు, సిబ్బంది సమయ పాలన పాటించాలన్నారు. వైద్యులు, సిబ్బంది ఆయనకు అభినందనలు తెలిపారు.

ఉన్న సిబ్బందితోనే పారిశుధ్య పనులు

రాజాం: పురపాలక సంఘ పరిధిలోని ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఉన్న సిబ్బందితోనే పారిశుధ్య కార్యక్రమాలు, తాగునీరు అందించేలా అధికారులు చర్యలు చేపడుతున్నారు. పురపాలక సంఘ పరిధిలో పారిశుధ్య కార్మికులు, తాగునీటిని సరఫరా చేసే కార్మికులు సమ్మెలో ఉన్న విషయం తెలిసిందే. ప్రస్తుతం ఉన్న నలుగురు రెగ్యులర్ సిబ్బందితో కమిషనర్ ఎంవీ నాగరాజు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, ఏఈలు చెత్త సేకరణ, తాగునీటి సరఫరా చేయిస్తున్నారు. తాగునీరు విడుదల విషయంలో మాత్రం అన్ని వార్డులకు పూర్తి స్థాయిలో న్యాయం జరగడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు.

సింహాచలం వరకు పాదయాత్ర

కొత్తవలస: ధనుర్మాసం సందర్భంగా మంగళపాలెం గ్రామంలోని గురుదేవ చారిటబుల్ ట్రస్టు కార్యాలయం నుంచి వేలాది మంది భక్తులు బుధవారం పాదయాత్రగా సింహాచలం వెళ్లారు. ట్రస్టు చైర్మన్ రాపర్తి జగదీష్ బాబు ఆధ్వర్యంలో కొత్తవలస, లక్కవరపుకోట, పెందుర్తి మండలాలతో పాటు ఏజెన్సీ మండలాలైన అరుకు, అనంతగిరి, డుంబ్రిగుడ మండలాల నుంచి పెద్ద సంఖ్యలో గిరిజనులు హాజరయ్యారు. తమ ట్రస్టు చేస్తున్న ఆధ్యాత్మిక కార్యక్రమాలలో భాగంగా సింహాచలం వరకు పాదయాత్రను నిర్వహించినట్లు ఆయన తెలిపారు. ఈ పాదయాత్రలో సుమారు 5 వేల మంది వరకు పాల్గొన్నారు.

కోలాటం విజేతలకు బహుమతులు

బాడంగి: కోడూరు గ్రామంలో జిల్లా స్థాయి కోలాటం పోటీలను బుధవారం నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందిన వారికి జిల్లా పరిషత్ చైర్మన్ చిన్న శ్రీను బహుమతులు అందజేశారు. నారాయణప్పవలసకు ప్రథమ బహుమతిగా రూ.15వేలు, పొందూరు బృందానికి రూ.10 వేలు, పెనుబాక, బొద్దాం, విజయనగరం బృందాలకు చెరో రూ.5వేల చొప్పున అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు, తెంటు నారాయణరావు, పెద్దింటి రామారావు, శంబంగి వేణుగోపాల నాయుడు, మరిపి శంకరరావు, భోగి గౌరి తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎంలపై అవగాహన

లక్కవరపుకోట: వీరభద్రపేట గ్రామంలో బుధవారం ఈవీఎంలపై అవగాహన కల్పించారు. తహసీల్దార్ కల్యాణచక్రవర్తి ఆధ్వర్యంలో ప్రజలకు ఈవీఎంల ద్వారా ఓటు హక్కు వినియోగించుకునే విధంగా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ప్రజలు రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును తప్పనిసరిగా ఉపయోగించుకోవాలన్నారు.

నూతన భూ హక్కు చట్టంతో నష్టమే

శృంగవరపుకోట, జనవరి 10: నూతన భూ హక్కు చట్టం రాష్ట్ర ప్రజల పాలిట యమపాశం అని స్థానిక బార్ అసోసియేషన్ న్యాయవాదులు అన్నారు. ఈ చట్టం అమలుపై బుధవారం కోర్టు ప్రాంగణంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. దీన్ని రద్దు చేయాలని కోరుతూ బార్ అసోషియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు సత్యాజీ, శర్మ ఆధ్వర్యంలో న్యాయవాదులు ఒంటికాలిపై నిల్చొని నిరసన తెలిపారు.



ఒంటికాలిపై నిరసన తెలియజేస్తున్న ఎస్‌కోట న్యాయవాదులు

కూనాయవలసలో అంబేడ్కర్ విగ్రహావిష్కరణ

తెర్లాం, జనవరి 10: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని కూనాయవలస గ్రామంలో సర్పంచ్ బోడెల విజయ్‌బాబు బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ ఆశయ సాధనకు మనమంతా నడుం బిగించాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మీసాల అప్పలస్వామి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

ఆమ్ ఆద్మీలో చేరిన విశ్రాంత ఉద్యోగులు

శృంగవరపుకోట, జనవరి 10: ఎస్.కోట పట్టణానికి చెందిన విశ్రాంత ఉద్యోగులు బుధవారం ఆమ్‌ఆద్మీ పార్టీలో చేరారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పూసపాటి ప్రతాప్‌వర్మ ఆధ్వర్యంలో చేరిన వీరికి పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి దయానంద్ కండువాలు కప్పి స్వాగతం పలికారు.

ఓం సదనంలో ప్రత్యేక పూజలు

కొత్తవలస, జనవరి 10: మాస శివరాత్రి సందర్భంగా బుధవారం మండలంలోని తుమ్మికాపల్లి గేట్ సమీపంలోనున్న ఓం సదనంలో 108 శివ లింగాలకు మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు చేశారు. మాస శివరాత్రి రోజున శివునికి అభిషేకాలను నిర్వహించడం వల్ల మంచి జరుగుతుందని నిర్వాహకుడు అంపోలు ఉమామహేశ్వర శర్మ తెలిపారు.





అంతులేని అభిమానంతో..



అడిగడిగో చంద్రన్న..



చిన్నారులు సైతం విక్టరీ చూపుతూ..



చంటిబిడ్డలను చంకనేసుకుని..



బహిరంగ సభకు పరిగెడుతూ..

ఉత్సాహంగా..

బొబ్బిలిలో బుధవారం నిర్వహించిన 'రా.. కదిలిరా' సభ గ్రాండ్ సక్సెస్ అయింది. చిన్నారులు.. వృద్ధులు అనే తేడా లేకుండా సభకు తరలి వచ్చారు. కొందరైతే సంతోషంతో నృత్యం చేశారు. చంద్రబాబును చూసేందుకు కొందరు ఇళ్లపైకి ఎక్కారు. మొత్తంగా సభ విజయవంతం కావడంతో టీడీపీ శ్రేణుల్లో మరింత జోష్ నెలకొంది.

కరాటే పోటీలకు ఎంపిక

విజయనగరం రూరల్, జనవరి 10: జేఎన్‌టీయూ సౌత్ వెస్ట్ జోన్ ఇంటర్ వర్సిటీ పోటీలకు కరాటే క్రీడాకారుల ఎంపిక ప్రక్రియ రఘు ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం జరిగింది. పురుషుల విభాగంలో కె.నిరంజన్, జి.కల్యాణ్, కె.మనోజ్ కుమార్, కె.దినేష్. కె.సాయి శివకుమార్, పి.సాయికుమార్, మహిళల విభాగంలో టి.లిఖిత ఎంపికయ్యారు. వీరిని కళాశాల ప్రొఫెసర్ కె.వెంక టసుబ్బయ్య, రిజిస్ట్రార్ జి.జయసుమ, స్పోర్ట్స్ కో-ఆర్డినేటర్ డాక్టర్ ఏవీ అప్పారావు, పీడీ నాగరాజు తదితరులు అభినందించారు.



ఎంపికైన క్రీడాకారులను అభిందిస్తున్న జేఎన్‌టీయూ సిబ్బంది

19 వరకూ సమతా సంకల్ప మహోత్సవాలు

- జేసీ మయూర్ అశోక్



మాట్లాడుతున్న జేసీ మయూర్ అశోక్

కలెక్టరేట్, జనవరి 10: జిల్లా వ్యాప్తంగా ఈనెల 19వ తేదీ వరకూ సామాజిక సమతా సంకల్ప మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు జేసీ మయూర్ అశోక్ వెల్లడించారు. బుధవారం తన చాంబర్‌లో వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ అంబేద్కర్ 125 అడుగుల విగ్రహాన్ని ఈ నెల 19న విజయవాడలో ఆవిష్కరించనున్న నేపథ్యంలో ఈ మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అంబేద్కర్ జీవిత విశేషాలను అన్ని వర్గాల ప్రజలకు తెలియజెప్పేలా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఈ సమావేశంలో డీఆర్‌డీఏ పీడీ కల్యాణ చక్రవర్తి, జెడ్పీ సీఈవో రాజ్‌కుమార్, మెప్మా పీడీ సుధాకర్, వార్డు సచివాలయ అధికారి నిర్మలాదేవి, డీఈవో లింగేశ్వర్‌రెడ్డి, డీపీవో శ్రీధర్ రాజా తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమ్మె విరమణ

రాజాం రూరల్, జనవరి 10: ప్రభుత్వంతో చర్చలు సఫలం కావడంతో తాత్కాలికంగా సమ్మె విరమించినట్లు మున్సిపల్ కార్మికులు తెలి పారు. జీవో వచ్చిన తర్వాత పూర్తిగా సమ్మె విరమిస్తామని స్పష్టం చేశారు. సమ్మె కాలానికి వేతనం ఇచ్చేందుకు సర్కారు అంగీకరించిందని, ఈ మేరకు గురువారం నుంచి పారిశుధ్య కార్మికులు విధుల్లో చేరనున్నారని సీఐటీయూ నాయకులు తెలిపారు. వారికి వేతనం రూ. 21 వేలు ఇవ్వడానికి ప్రభుత్వం ఒప్పుకుందన్నారు. ఇంజినీరింగ్ కార్మికుల కోసం ప్రత్యేక కమిటీ వేసి వేతనాల నిర్ధారించనున్నారని తెలిపారు.

భిక్షాటన చేస్తూ నిరసన

గత ఎన్నికల ముందు ప్రతిపక్షనేతగా జగ న్మోహన్‌రెడ్డి మున్సిపల్ కార్మికులను దేవుళ్లుగా భావించి వారి కాళ్లు కడిగి నీటిని నెత్తిపై జల్లుకున్నారని, నేడు వారి సమస్యల్ని పరిష్కరించకుండా కాలే కడుపుల్తో పస్తులుండేందుకు కారకులయ్యారని సీఐటీయూ జిల్లా కార్యదర్శి రామ్మూర్తినాయుడు ఆరోపించారు. ఏపీ మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో 16 రోజులుగా సమ్మె చేస్తున్న మున్సిపల్ పారిశుధ్య కార్మికులు రాజాంలో బుధవారం భిక్షాటన చేసి ప్రభుత్వానికి తమ నిరసన తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న రామ్మూర్తినాయుడు ప్రభుత్వ దుర్మార్గ వైఖరిని దుయ్యబట్టారు. పలువురు యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

రైలు కింద పడి యువకుడి ఆత్మహత్య



నవీన్ (ఫైల్)

చీపురుపల్లి: చీపురుపల్లి రైల్వే స్టేషన్ సమీపంలో గురువారం ఉదయం జి.అగ్రహారానికి చెందిన కోట్ల నవీన్ (28) రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రైల్వే స్టేషన్‌కు సమీపంలోని ఆరు ఖానాల వద్ద నవీన్ మృతదేహాన్ని గుర్తించిన కొంతమంది కుటుంబసభ్యులకు సమాచారం అందజేశారు. నవీన్ ఆత్మ హత్యకు కారణాలు తెలియరాలేదు. రైల్వే పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ..



రామన్న

శృంగవరపుకోట రూరల్, జనవరి 10: కృష్ణాపురం కోళ్ల ఫారం వద్ద అనుమానాస్పద రీతిలో ఒక యువకుడు మరణించిన సంఘటన తెలిసిందే. ఈ ఘటనలో ఈ నెల 7న సీవేరి రవి ఎస్.కోట ఆసుపత్రిలో మృతిచెందగా... మరో యువకుడు సీవేరి రామన్న (20) పరిస్థితి విషమంగా ఉండటంతో విజయనగరం తరలించారు. ఆ యువకుడు విజయనగరం సర్వజన ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మధ్యాహ్నం మృతి చెందినట్లు ఎస్‌ఐ లోవరాజు తెలిపారు. యువకుడి మృతదేహానికి పోస్టుమార్టం పూర్తి చేసి... బంధువులకు అప్పగించినట్లు ఎస్‌ఐ లోవరాజు తెలిపారు.

మద్యం అక్రమ రవాణా.. వ్యక్తి అరెస్ట్



మద్యం సీసాలతో సీఐ

క్రైం : గంట్యాడ మండలం పెదమజ్జిపాలెం శివారులో అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసి 40 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు సి.ఐ. రామచంద్రకుమార్ తెలిపారు. నిందితునిపై 41(ఎ) సెక్షన్ కింద కేసు నమోదు చేసి... స్టేషన్ బెయిల్ ఇచ్చినట్లు తెలిపారు. ఈ దాడుల్లో ఎస్‌ఐ కరుణలత తదితరులు పాల్గొన్నారు.

వంట సారా తయారీపై దాడులు

కొత్తవలస, జనవరి 10: విజయనగరం ఎస్‌ఈబీ ఏఎస్పీ ఎస్.వెంకటరావు ఆదేశాల మేరకు బుధవారం వివిధ ప్రాంతాల్లో దాడులు చేసినట్లు ఎస్‌ఈబీ సీఐ రాజేశ్వరి తెలిపారు. చినమన్నిపాలెం జంక్షన్ వద్ద మోటార్ సైకిల్‌తో సారా రవాణా చేస్తున్న బొబ్బాది ముత్యాలును పట్టుకుని 10 లీటర్ల సారాతో పాటు మోటార్ సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. వేపాడ మండలం బొద్దాం గ్రామంలో ఒక లీటరు సారా కలిగిన గల్లా రమణను పట్టుకుని కేసు నమోదు చేసినట్టు తెలిపారు. రామలింగపురం, చిన మన్నిపాలెం గ్రామాల్లో వంట సారా తయారీకి వినియోగించే 6 వందల లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశామన్నారు. ఈ దాడుల్లో ఎస్‌ఐ నరేంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.